ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ప్రవేశానికి మరో అవకాశం

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థులకు మరో అవకాశం కల్పించిందని కూకట్‌పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మావతి తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీలో చేరేందుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని ఆమె తెలిపారు. గ్రూపులో చేరేందుకు విద్యార్థులు దోస్త్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కూకట్‌పల్లి: వివేకానందనగర్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాయినేని చంద్రకాంతరావు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో అనుపమ హాస్పిటల్ ముందు రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాల విమర్శలు సరికాదన్నారు. అకాల వర్షాలు కారణంగా డివిజన్‌లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని తెలిపారు.

ఘనంగా కార్గిల్ దివస్



మూసాపేట: కూకట్‌పల్లిలోని లులు మాల్‌లో కార్గిల్ విజయ్ దివస్ వేడుకల్ని శనివారం నిర్వహించారు. త్రివిధ దళాల విశ్రాంత అధికారులను లులు మాల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కల్నల్ పి. రమేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ షేక్ మాట్లాడుతూ.. భారత సైన్య చరిత్రలో కార్గిల్ యుద్ధం సువర్ణ అక్షరాలతో లిఖించదగిన గొప్ప అధ్యాయం అన్నారు. యుద్ధంలో అమరులైన సైనికులకునివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్మీ విశ్రాంత అధికారులు కల్నల్ శ్రీనగేష్, కెప్టెన్ చంద్రశేఖర్, వింగ్ కమాండర్ రాధాకృష్ణ, కమాండర్ అశోక్ కుమార్, లులుమాల్ రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్, జీఎం విమేష్ పాల్గొన్నారు.

మూడు సెక్టార్లుగా అల్లాపూర్ డివిజన్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌ను మూడు సెక్టార్లుగా విభజించినట్లు సీఐ సామల వెంకటరెడ్డి తెలిపారు. ముగ్గురు ఎస్ఐలను సెక్టార్ల వారీగా బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ఇక్కడ సైబర్ క్రైమ్ విభాగాన్ని కూకట్‌పల్లి డీఐ వెంకటేశం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. సెక్టార్ 1 వి. మాల్యా నాయక్ ఎస్ఐ సెల్ నంబర్ 8712568179 సర్దార్ నగర్, రాజీవ్‌గాంధీ నగర్, యూసుఫ్ నగర్, సెక్టార్ 2 ఎస్ఐ సాయి కృష్ణ సెల్ నంబర్ 8712554146, అల్లాపూర్, పద్మావతి నగర్, ఆర్కే సొసైటీ, శివాజీ నగర్, న్యూ అల్లాపూర్, సెంట్రల్ అల్లాపూర్, సీతయ్య నగర్, రాణా ప్రతాప్ నగర్, అజీజ్ నగర్, మేరాజ్ నగర్, పండిట్ నెహ్రూ నగర్, ఫ్రెండ్స్ కాలనీ, సెక్టార్ 3 ఎస్ఐ మహ్మద్ మాజీద్ అలీ సెల్ నంబర్ 8712568293 వివేకానందనగర్, గాయత్రినగర్, పర్వత్‌నగర్, తులసి నగర్, జ్యోతి నగర్, లక్ష్మీ నగర్ సెక్టార్లుగా విభజించామని పేర్కొన్నారు. అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సెల్ నంబర్ 8712663699 ఇన్‌స్పెక్టర్ సామల వెంకట రెడ్డి 8712663335 పెట్రోలింగ్ సెల్ నెంబర్ 8712663696 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సైనికుల వల్లే సురక్షితంగా దేశం



5కే రన్‌ను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

సుభాష్‌నగర్: దేశ సరిహద్దులో సైనికుల రేయింబవళ్లు పహారా కాస్తున్నందు వల్లే మనం సురక్షితంగా ఉన్నామని, వారి సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని సూరారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కేశవ్‌యాదవ్ ఆధ్వర్యంలో సూరారం కట్టమైసమ్మ నుంచి షాపూర్‌నగర్ చౌరస్తా వరకు నిర్వహించిన 5కే రన్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్ల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ఉపాధ్యక్షులు రాజా రెడ్డి, గారుబావి గడ్డ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శులు గిరివర్ధన్ రెడ్డి, విగ్నేశ్వర్, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్, జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి, రాజేష్ చారి, రాజు, జోగిని సతీష్ సాగర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దుర్యోధనరావు, నాయకులు సంతోష్ గుప్తా, దీపక్, జాల వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపుగా కలుపు మొక్కలు..

ఆవాసంగా చెట్ల పొదలు, కలుపు మొక్కలు
తొలగించాలంటున్న కాలనీల ప్రజలు

కాలనీల్లోకి విష సర్పాలు!



పరికి చెరువు నాలా పక్కన ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు



ఆల్విన్‌కాలనీ: కాలనీలలోకి విష సర్పాలు ప్రవేశించి స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, తులసినగర్, షిర్డీ నగర్, ప్రభుత్వ పాఠశాలలైన శంషీగూడ, ఎల్లమ్మబండ ప్రాంతాల్లో పాములు, తేళ్లు, జెర్రీలు వంటి విష సర్పాలు, పురుగులు స్థానికంగా ఉన్న పరికి చెరువు నాలా గుండా చెట్ల పొదల నుంచి కాలనీలోకి వస్తున్నాయి. స్థానికంగా ఉన్న పరికి చెరువు కట్టపై దట్టమైన చెట్ల పొదలు ఉండటంతో చెరువు మత్తడి, తూము ద్వారా ప్రవేశించి నాలా గుండా ఏపుగా పెరిగిన చెట్లు, చెదారం, కలుపు మొక్కలలో నుంచి ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. చెట్లు, చెదారంతో పాటు నాలాలో ఎలుకలు పెట్టిన సొరంగాలలో విష సర్పాలు పిల్లల్ని పెట్టి పెద్ద సర్పాలు, చిన్న సర్పాలు ఇళ్లముందట రాత్రి పగలు అనే తేడా లేకుండా సంచరిస్తుండటంతో ఆరుబయటకు రాలేని పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. వేసవిలో నాలాలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించటానికి జీహెచ్ఎంసీ అధికారులు జేసీబీల ద్వారా చెత్తను గట్టుపైకి చేర్చాల్సి ఉంటుంది. కొన్ని ప్రదేశాల్లో మాత్రమే చెత్తను తరలిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల సమస్య ఉన్న ప్రాంతంలో సంబంధిత జేసీబీ కాంట్రాక్టర్లు చెత్తను తొలగించకపోవటంతోనే చెట్ల పొదలు పెరిగి విష సర్పాలకు ఆవాసంగా మారిందని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలుపు మొక్కలు తొలగించాలి

ఆల్విన్‌కాలనీ పరికి చెరువు నాలా ప్రవహించే ప్రాంతంలో ఏపుగా కలుపు మొక్కలు పెరగటంతో విష సర్పాలకు ఆవాసంగా మారింది. ప్రతి రోజు వర్షాలు కురుస్తుండటంతో పాములు, తేళ్లు, జెర్రీలు పరిసర ప్రాంతాల్లోకి వస్తున్నాయి. నాలా పరిసర ప్రాంతాలు సంబంధిత అధికారులు శుభ్రం చేయించి విష సర్పాల భారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.

– మీసాల వెంకట్, ఆల్విన్‌కాలనీ

యూపీహెచ్‌ఎస్ సెంటర్‌లో కలెక్టర్ తనిఖీ



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని యూపీహెచ్‌ఎస్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ మను చౌదరి శనివారం తనిఖీ చేశారు. సెంటర్‌లో వర్షం నీరు కురుస్తూ గోడలకు చెమ్మ రావటం, వర్షపు నీరు లోపలికి రాకుండా శ్లాబ్ పైన టార్పెంట్ షీట్ వేయించటపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకు ఎంతమంది ఓపీ పేషెంట్లు వస్తారని, వారి నమోదు ఏ విధంగా రిజిస్టర్ చేస్తున్నారని ఆన్‌లైన్‌లో పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ఫీవర్ సర్వే చేస్తున్నారా?, డెంగీ పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారని మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలోని మెడిసిన్ రూమ్, ల్యాబ్, ఎక్స్‌రే, సిటీ స్కాన్ రూములను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వామి, మెడికల్ ఆఫీసర్ మమత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతుల కల్పనకు నిరంతరం కృషి



గాంధీకి సమస్యలు వివరించిన పాపారాయుడు నగర్ వాసులు

పీఏసీ ఛైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపారాయుడు నగర్ కాలనీవాసులు సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని శనివారం గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే పాపారాయుడు నగర్ కాలనీలో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. అవసరమున్న చోట రోడ్లను, యూజీడీ పైపులైన్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.


నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

ఆల్విన్‌కాలనీ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని గీతాంజలి ఒలంపియాడ్ హైస్కూల్ స్టూడెంట్ క్యాబినెట్ ఎన్నికలు ప్రిన్సిపాల్ ఉమావెంకట్ ఆధ్వర్యంలో శనివారం జరిగాయి. ఎన్నికైన విద్యార్థుల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత పుట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండలి : సీఐ



బాలానగర్ సీఐ నర్సింహ రాజు

బాలానగర్: వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ సీఐ నర్సింహ రాజు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా వరదలు సంభవించినప్పుడు ప్రజలకు సహాయ సహకారాలు అందించడానికి బాలానగర్ పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్పబయటకు రావద్దని, కరెంట్ పోల్స్, మ్యాన్‌హోల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం బాలానగర్ పోలీస్‌స్టేషన్ 8712663209 సెక్టార్ 1 ఎస్ఐ వినోద్ 8712554136, సెక్టార్ 2 హాజీ మియా 8712663384, సెక్టార్ 3, 4 సరితా పటేల్ రెడ్డి 8712663201, హైడ్రా కంట్రోల్ రూమ్ 8712663209, 9000113667, 040–29555500, ఐసీసీసీ కంట్రోల్ రూం 87126784000 నంబర్‌లకు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు. బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన నంబర్ 24 గంటలు పని చేస్తుందని తెలిపారు.

బంజారా విద్యార్థి సంఘం జేఎన్‌టీయూహెచ్ కమిటీ ఎన్నిక

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ బంజారా విద్యార్థి సంఘం నూతన కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. వర్సిటీలోని గోల్డెన్ జూబ్లీ బిల్డింగ్ వద్ద నిర్వహించిన సమావేశంలో బంజారా విద్యార్థుల సమక్షంలో యూనివర్సిటీ అధ్యక్షుడు డి. శ్రీకాంత్ నాయక్, కన్వీనర్ దరావత్ సింహాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ తిరుపతి, ప్రధాన కార్యదర్శి సాయి కిరణ్, ఉపాధ్యక్షులు మహేష్, గౌతమ్, జగన్, విష్ణుమోహిత్, అధికార ప్రతినిధి సుశాంత్, కార్యదర్శులు ధర్మతేజా, రఘురామ్‌లను కార్యవర్గంలోకి తీసుకున్నారు.



సన్మానం

మోతీనగర్: వాయుసేన విభాగంలో అనేక సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన సోమా రమేష్‌ను లయన్స్ క్లబ్ సనత్‌నగర్, సీనియర్ సిటీజన్ తరపున శనివారం ఘనంగా సన్మానించారు. కార్గిల్ విజయ్ దివస్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎం. రాంచందర్, ఎస్. నాగేశ్వరరావు, పి. సత్యనారాయణ, చంద్రయ్య, జైపాల్ రెడ్డి, ప్రేమకుమార్, జె.నాగేశ్వరరావు, విద్యాసాగర్ రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఫిట్స్‌తో ఉద్యోగి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: శుభకార్యానికి హాజరయ్యేందుకు వచ్చిన ఓ పర్యాటక శాఖ ఉద్యోగి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేపీహెచ్‌బీ పోలీసుల వివరాల ప్రకారం .. నాగార్జునసాగర్ ప్రాంతంలో నివాసం ఉంటూ వట్టికోటి వెంకటేశ్వర్లు(49) పర్యాటక శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీ హితియాస్ రెస్టారెంట్‌లో జరుగుతున్న ధోతి ఫంక్షన్‌లో పాల్గొనేందుకు రాత్రి 9 గంటలకు వచ్చాడు. తొమ్మిదిన్నర సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కుప్పకూలిపోయాడు. దీంతో వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: స్నేహితులను కలిసేందుకు హాస్టల్‌కు వచ్చిన ఓ విద్యార్థి గ్యాస్ ట్రబుల్ టాబ్‌లెట్ వేసుకుని నిద్రపోయి మృతి చెందాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన బొమ్మెన బాపు కుమారుడు మధుమోహన్ (23) దిల్‌సుఖ్ నగర్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. కేపీహెచ్‌బీ 5వ ఫేజులోని తన స్నేహితులను కలిసేందుకు 24న వచ్చాడు. 25న మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత తనకు గ్యాస్ ట్రబుల్ ఉందని చెప్పి ట్యాబ్‌లెట్ వేసుకున్నాడు. స్నేహితులు కార్తిక్, యశ్వంత్, ప్రణయ్, ఆజంలతో కలిసి నిద్రపోయాడు. సాయంత్రం టీ తాగేందుకు లేపడానికి స్నేహితులు యత్నించగా.. ఎంతకు లేవకపోవడంతో వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. దీంతో మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటి బీజేపీ నిరసన



నిజాంపేట్: ప్రజలకు కనీస వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ అన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై గుంతలలో మొక్కలు నాటి శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేటలోని వైకుంఠ ధామం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేసినా స్పందించడం లేదన్నారు. పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ రోడ్ల మరమ్మత్తులపైన, డ్రైనేజీ నిర్మాణాలపైన, దోమల సమస్యపైన అధికారులు చూపటం లేదన్నారు. యంత్రాంగం స్పందించకుంటే కార్యకర్తలతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మూర్తి, దాసి నాగరాజు, ప్రసాద్‌రాజు, నరేంద్ర చౌదరి, వెంకటేష్ ముదిరాజ్, సెక్రెటరీ కౌశిక్ నాయుడు, సతీష్ కృష్ణ, పాండు, విష్ణుదత్తు, కుంకి రాము, సురేష్, రాజేష్ ముదిరాజ, భూపాల్, ఈశ్వర్‌రావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం



పద్మశ్రీ మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రాజేందర్ తదితరులు

కూకట్‌పల్లి: బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్‌లో మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అలయ్ బలయ్ కార్యక్రమం శనివారం జరిగింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంతి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మందకృష్ణను సన్మానించారు. మందకృష్ణ మాదిగ దశాబ్దాలుగా దళితుల వర్గీకరణ, హక్కుల చట్టం కోసం చేపట్టిన ఉద్యమాలు తెలుగు రాష్ట్రాల్లో చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకుల, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి: మంద కృష్ణమాదిగను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ సన్మానించారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. అదేవిధంగా బీజేపీ నాయకులు మక్కాల నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.



మంద కృష్ణ మాదిగను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- గత ప్రభుత్వంలో అందరి ఫోన్ ట్యాంపరింగ్
- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

మూసాపేట: అసెంబ్లీ ఎన్నికల ముందు తనతో పాటు, తన అసిస్టెంట్ నెంబర్లు, పార్టీ ముఖ్య నాయకుల నెంబర్లు సైతం బీఆర్‌యస్ ప్రభుత్వం టాంపరింగ్ చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ ఆరోపించారు. శనివారం ఆంజనేయనగర్ కాలనీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోపే నియోజకవర్గానికి రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. పదేళ్లలో పేదలకు ఓ రేషన్ కార్డు కూడా ఇవ్వని ప్రభుత్వం బీఆర్ఎస్ అని ఎద్దేవా చేశారు. కైత్లాపూర్‌లో నిర్మించిన ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఇప్పటికి అలాగే ఉన్నాయని తెలిపారు. మూసాపేట వై జంక్షన్, జేఎన్‌టీయూ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారానికి ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పనులు ప్రారంభించిందన్నారు. ఎమ్మెల్యే కనుసన్నలలోనే నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు ఆక్రమించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. అధికారులను బెదిరించటం, ప్రశ్నించిన వారి మీద కేసులు పెట్టడం, ప్రత్యర్థి వర్గాల ఫోన్‌లను ట్యాంపరింగ్ చేయటం తప్ప ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. సమావేశంలో కూకట్‌పల్లి ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, తూము వేణు, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పలహారం బండి ఊరేగింపు

ఆల్విన్‌కాలనీ: సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్టలో పలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. చంద్రమోహన్ సాగర్, ఎండీ ఇబ్రహీం పాల్గొన్నారు.

రోడ్లపై వర్షపు నీరు తొలగింపు



వర్షపు నీటి తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు హైటెన్షన్ లైన్, లేక్ వ్యూ కాలనీ మెయిన్‌రోడ్డు వద్ద జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ యాసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ వారితో కలిసి రోడ్డుపై నీరు నిలిచిన ప్రాంతాల్లో నీటిని మోటార్ సాయంతో శనివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన నీళ్లను మళ్లించి ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, హైడ్రా టీం సూపర్‌వైజర్ గురు, డివిజన్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పీపీఈ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కార్మికులకు పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ప్రతినిత్యం కార్మికులు చెత్తను తరలిస్తున్నారని, కరోనా వంటి విపత్కర సమయంలో సైతం సేవలు అందించిన పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కూడా ఎంతో కీలకమన్నారు. కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారని అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ, ఏఎంహెచ్‌ఓ కవిత, ఎస్‌ఎఫ్‌ఏలు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం మొక్కల విక్రయం

సుభాష్‌నగర్: దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో శ్రీగంధం మొక్కలను విక్రయానికి అందుబాటులో ఉంచారు. రాష్ట్ర అటవీ శాఖ పరిశోధనా విభాగం , ఫారెస్ట్ రిసెర్చ్ సెంటర్ సిద్దిపేట జిల్లా ములుగు ఈ మొక్కలను అభివృద్ధి చేసినట్లు అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఒక్కొక్క మొక్కను రూ.25 చెల్లించి కావాల్సిన మొక్కలను కొనుగోలు చేయవచ్చని, మరిన్ని వివరాల కోసం స్టేట్ సిల్వికల్చరిస్ట్, హైదరాబాద్‌ను సంప్రదించాలని కోరారు. ఆసక్తి కలిగిన రైతులు 8500771349, 9703433429, 944085592 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.